హామీలన్నీ నెరవేరుస్తాం..

- ఇచ్చిన మాటకు కట్టుబడిన ప్రభుత్వం ఒక్క వైఎస్సార్‌సీపీయే
- డిప్యూటీ సీఎం రాజన్నదొర


రేగులపాడు కొండపైకి నడిచి వెళ్తున్న మంత్రి రాజన్న, తదితరులు


ఉద్దంగిలో లబ్ధిదారునికి బుక్‌లెట్ అందజేస్తున్న మంత్రి రాజన్నదొర

మెంటాడ: ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ తప్పకుండా నెరవేరుస్తామని, ఇప్పటికే ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో 98 శాతానికి పైగా నెరవేర్చామని డిప్యూటీ సీఎం, గిరిజన శాఖా మంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. మండలంలోని ఉద్దంగి, కూనేరు, రేగులపాడు, పెద్దపాడు గ్రామాలలో సోమవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గిరిజన తండాలైన రేగులపాడు, పెద్దపాడు ప్రాంతాలకు కొండలపై నుంచి నడుచుకుంటూ వెళ్లి ప్రజలను కలుసుకున్నారు. ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరుపై అడిగి తెలుసుకున్నారు. చిన్నారులను బడికి పంపుతున్నారా, లేదా అని ఆరా తీశారు. నాలుగేళ్లలో వైఎస్సార్‌సీపీ హయాంలో ఒక్కో కుటుంబానికి ఎంత లబ్ధి చేకూరినదీ వివరిస్తూ ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్లను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, గిరిజనులకు అండగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉంటుందన్నారు. గిరిజన తండాల్లో సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు తామెప్పుడూ ముందుంటామని చెప్పారు. జల్‌జీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికీ కుళాయిల్ని దశల వారీగా ఏర్పాటు చేస్తున్నామన్నారు. రైతుల శ్రేయస్సు కోరి ప్రతి పంచాయతీలోనూ ఆర్‌బీకే కేంద్రాలను ఏర్పాటు చేసి వ్యవసాయం మంచి ఆదాయ మార్గంగా మలిచామని చెప్పారు. ప్రధానంగా గిరిజన పిల్లల ఉన్నత విద్య కోసం ప్రభుత్వం అన్ని వసతులు కల్పిస్తోందన్నారు. అలాగే ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా వైద్యులు ఇంటింటికీ వెళ్లి సేవలందిస్తున్నారని తెలిపారు. గిరిజన గ్రామాలైన కేవీఎల్ వలస, కూనేరు, ఉద్దంగి గ్రామాలకు మధ్యలో నిలిచిపోయిన తారురోడ్డు నిర్మాణాలను త్వరలోనే పూర్తి చేస్తామని చెప్పారు. ప్రజా సంకల్పయాత్రలో ఇచ్చిన హామీలతో ఇవ్వని హామీలను కూడా నెరవేర్చిన ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఒక్కరేనన్నారు. కార్యక్రమానికి ముందుగా మంత్రి రాజన్నదొరకు స్థానిక గిరిజనులు మేళతాళాలతో ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు శ్రీరాములు, కొర్రాయి లక్ష్మి, హనుమంతరాజు, బుజ్జి, సంతోష్, ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు, వైస్ ఎంపీపీలు సారిక ఈశ్వరరావు, పొట్టంగి దుర్గ, నాయకులు లెంక రత్నాకర్‌నాయుడు, మయూర్ అప్పలనాయుడు, రెడ్డి రాజప్పలనాయుడు, చొక్కాకు సన్యాసినాయుడు, చప్ప మాస్టారు, తదితరులు పాల్గొన్నారు.

ఎనిమిది ఆర్బీకేల్లో ధాన్యం కొనుగోలు


పెదభోగిలిలో ఎరువులను పరిశీలిస్తున్న ఏఓ ఎస్. అవినాష్

సీతానగరం: మండలంలోని రైతులు రబీవరి సాగు చేసిన ధాన్యాన్ని కొనుగోలు చేయడానికి 8 రైతుభరోసా కేంద్రాలను ఎంపిక చేసినట్లు ఏఓ ఎస్. అవినాష్ తెలిపారు. ఖరీఫ్ వరిసాగుకు ముందు జాగ్రత్తచర్యల్లో భాగంగా 4 ఆర్బీకేలకు వచ్చిన ఎరువులను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 430 ఎకరాల్లో రైతులు రబీవరి సాగు చేసినట్లు తెలియజేశారు. ప్రభుత్వం రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయడానికి 8 రైతు భరోసా కేంద్రాల్లో కొనుగోలు చేస్తుందని చెప్పారు. ప్రస్తుతం రబీ వరిచేను పూత, వెన్ను పాలు పోసుకునే దశలో మడులలో ఉన్నందున కొనుగోలు కేంద్రాలు మంజూరు చేసినా ప్రారంభించడానికి సమయం పడుతుందన్నారు. వరినారు మళ్లు తయారుచేసినప్పటికీ 2023–24 ఖరీఫ్ సీజన్‌లో వరిసాగు చేయనున్న రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు ముందు జాగ్రత్తచర్యగా ఆర్బీకేల్లో నిల్వలుంచినట్లు తెలియజేశారు. జిల్లా ఉన్నతాధికారుల సూచనల మేరకు ఎరువులు విత్తనాలు భద్రపరిచామని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలియజేశారు.

ప్రభుత్వాస్పత్రుల్లోనే ప్రసవించాలి


రోగులను తనిఖీ చేస్తున్న డాక్టర్ ఉషారాణి

సీతానగరం: గర్భిణులు, దీర్ఘకాలిక వ్యాధులతో ఇబ్బందులు పడుతూ ప్రైవేట్ వైద్యం చేయించడానికి ఆర్థిక ఇబ్బందులు పడుతున్న వారికి గ్రామాల్లో నిర్వహించే ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా ఇళ్ల వద్దనే వైద్యసేవలు అందిస్తామని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ ఉషారాణి అన్నారు. ఈ మేరకు సోమవారం ఆర్.వెంకంపేటలో ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ ద్వారా ఉచితవైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలకు వైద్య పరీక్షలు నిర్వహించగా హెచ్‌బీ లోపం ఉన్న వారికి ఐరన్ మాత్రలు, ఐరన్ సుక్రోజ్ మందులు ఇస్తామన్నారు. అలాగే ఆరోగ్యశ్రీ పథకం ద్వారా వైద్య సేవలు పొంది ఇంటికి చేరుకున్న వారికి వైద్య సిబ్బంది పర్యవేక్షణలో ఉచితంగామందులు పంపిణీ చేస్తామని తెలిపారు. బీపీ, మధుమేహం,కీళ్లనొప్పులు, గ్యాస్ట్రిక్‌కు సంబంధించి అనారోగ్యానికి గురైన వారికి గృహసందర్శన చేసి మందులు ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు వివరించారు. ఆర్ వెంకంపేటలో నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌లో 69 మందికి ఉచితంగా వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో 108 సిబ్బంది దుర్గాప్రసాద్, ప్రసాద్, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

సాదాసీదాగా సర్వసభ్యసమావేశం


ప్రజాప్రతినిధులకు వివరాలు వెల్లడిస్తున్న ఎంఈవో మల్లేశ్వరరావు

మక్కువ: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ మర్రి పారమ్మ అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్యసమావేశం సాదాసీదాగా జరిగింది. ఈ కార్యక్రమానికి జెడ్పీటీసీ సభ్యుడు మావుడి శ్రీనివాసరావు హాజరయ్యారు. మండలస్థాయి అధికారులు ఆయా శాఖలకు సంబంధించిన ప్రగతిని సమావేశంలో వివరించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ శ్రీనివాసరావు మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు సంయుక్తంగా పనిచేసి, మండలాన్ని అభివృద్ధిపథంలో నడిపించాలని కోరారు. వచ్చేది ఖరీఫ్‌సీజన్ కావున రైతులు విత్తనాలు, ఎరువులకు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలని వ్యవసాయాధికారి శ్రీనివాసరావుకు సూచించారు. అలాగే వచ్చేవిద్యాసంవత్సరానికి సంబంధించి విద్యార్థులకు పూర్తిస్థాయి పాఠ్యపుస్తకాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఎంఈవో మల్లేశ్వరరావుకు స్పష్టం చేశారు. ఎండలు తీవ్రరూపం దాల్చడంతో మండలప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడకుండా చర్యలు చేపట్టాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో పి.దేవకుమార్, తహసీల్దార్ ఎ.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అభినందనల జల్లు


విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్ నిశాంత్ కుమార్

పార్వతీపురం: పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను కలెక్టర్ నిశాంత్‌కుమార్ సోమవారం తన కార్యాలయంలో అభినందించారు. పార్వతీపురంలో ఓ ప్రైవేటు పాఠశాలలో చదివి 600మార్కులకు 591 మార్కులు సాధించిన యాండ్రాపు హేనుజ, తుమరాడ ప్రణీత, 588 మార్కులు సాధించిన ఉరిటి సత్యదినేష్‌ను కలెక్టర్ అభినందించారు. ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు.

సిరిమాను సందర్భంగా వాహనాల దారి మళ్లింపు


మాట్లాడుతున్న ఏఎస్పీ నవీన్ సరోణి

- ఏఎస్పీ నవీన్ సరోణి

సీతానగరం: మండలంలోని పెదభోగిలిలో భోగితల్లి అమ్మవారి జాతరను పురస్కరించుకుని మంగళవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 12 గంటల వరకూ లక్షలాదిమంది భక్తులతో సిరిమాను తిరుగాడే ప్రాంతంలో ప్రజా సౌలభ్యం కోసం నిషేధాజ్ఞలు విధించినట్లు ఏఎస్పీ నవీన్ సరోణి అన్నారు. సోమవారం సాయంత్రం పెదభోగిలి నుంచి సీతానగరం మార్కెట్‌వరకూ సిరిమాను తిరువీధి రూట్‌మ్యాప్‌ను ఏఎస్పీ నవీన్ సరోణి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారి జాతరను పురస్కరించుకుని సీతానగరం, అప్పయ్యపేట, బుడ్డిపేట, జోగింపేట పెదభోగిలి గ్రామాల్లో జరుగుతున్నందున సీతానగరం మార్కెట్ భక్తులతో కిటకిట లాడుతున్నందున వాహనాలు దారి మళ్లించినట్లు చెప్పారు. అజ్జాడ,లక్ష్మీపురం వైపు, అజ్జాడ నుంచి బొబ్బిలి వైపు వెళ్లాల్సిన వాహనాలు నిడగల్లు మరిపివలస మీదుగా బొబ్బిలి వెళ్లాలని సూచించారు. అలాగే సిరిమాను పెదభోగిలి నుంచి బయలు దేరినప్పటి నుంచి తిరుగుముఖం పట్టేంతవరకు ఉత్సవకమిటీ సభ్యులు ఇచ్చిన సూచనల మేరకు పోలీసువారు అమలు చేసే ఆంక్షలను విధిగా పాటించి అమ్మవారిని దర్శించుకోవాలని కోరారు.కార్యక్రమంలో ఎస్సై కె.నీలకంఠం, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థి చికిత్సకోసం ఆర్థిక సహాయం


వైద్యసేవల నిమిత్తం రూ. 31వేలు అందిస్తున్న ఎంఎస్ఆర్ ఫౌండర్ శ్రీనివాసరావు

మక్కువ: మండలంలోని వెంకటభైరిపురం గ్రామం జెడ్పీహెచ్ఎస్‌లో 9వతరగతి చదువుతున్న గణేష్ మూడురోజుల క్రితం క్రికెట్ ఆడుతుండగా గాయపడ్డాడు. ప్రస్తుతం విశాఖపట్నంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. గణేష్ చికిత్సం కోసం సుమారు రూ.3లక్షలు అవసరముంటుందని వైద్యులు చెప్పడంతో, ఎంఎస్ఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు, మరడ శ్రీనివాసరావుతో పాటు, సభ్యులు స్పందించి రూ.31వేలను గణేష్ కుటుంబసభ్యులకు ఆర్థిక సహాయంగా అందించారు.

ట్యాంకర్లతో తాగునీటి సరఫరా


రోడ్డుపై ఆందోళన చేస్తున్న అప్పయ్యపేట కాలనీ వాసులు

సీతానగరం: మండలంలోని అప్పయ్యపేట, కాలనీలో పండగ సందర్భంగా తాగునీరు లేక అవస్థలు పడుతూ రోడ్డుపై గ్రామస్తులు బైఠాయించిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు స్పందించి ట్యాంకర్లద్వారా తాగునీరు సరఫరా చేయడానికి ఏర్పాట్లు చేశారు. భోగితల్లి అమ్మవారి జాతరను పురస్కరించుకుని గ్రామంలో తాగునీరు సౌకర్యం లేక అవస్థలు పడుతున్నందున కాలనీ వాసులు తాగునీరు సౌకర్యం కల్పించే వరకూ ఆందోళన చేస్తామని రోడ్డుపై బైఠాయించారు. ఈ సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే జోగారావు స్పందించి పార్వతీపురం మున్సిపాలిటీకి చెందిన రెండు వాటర్ ట్యాంకర్లతో ప్రజలకు పండగ రోజుల్లో తాగునీరు సరఫరా చేయాలని ఆదేశించారు.ఎమ్మెల్యే ఇచ్చిన హామీతో ఆందోళనకారులు శాంతించారు. ఆందోళనలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా సీతానగరం పోలీసులు చర్యలు తీసుకున్నారు.

ప్రభుత్వ జూనియర్ కాలేజీలో చేరాలి


ప్రభుత్వ కళాశాలలో చేరాలని ప్రచారం చేస్తున్న అధ్యాపకులు

సీతానగరం: విద్యాబోధనకు, విద్యార్థుల రాకపోకలకు అవసరమైన మౌలిక వసతులున్న ప్రభుత్వ జూనియర్ కాలేజీలో పదోతరగతి ఉత్తీర్ణులైన పిల్లల్ని తల్లిదండ్రులు చేర్పించాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు కోరారు. ఈ మేరకు సోమవారం సీతానగరం ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ బి.రేణుక ఆధ్వర్యంలో అధ్యాపకులు టి రవికుమార్, వినోద్, కిశోర్, నవీన్‌ప్రసాద్, అచ్చింనాయుడులు తామరఖండి, చినభోగిలి, బగ్గందొరవలస గ్రామాల్లో పదో తరగతి పాసైన విద్యార్థుల తల్లిదండ్రులను కలిశారు. ఈ సందర్భంగా సదుపాయాలున్న ప్రభుత్వ జూనియర్ కాలేజీలో పిల్లలను చేర్పించాలని కోరుతూ ప్రచారం చేశారు.

ఉద్యోగుల క్రమశిక్షణ వివరాలు సత్వరమే పొందుపరచాలి


మాట్లాడుతున్న ఉప సంచాలకుడు మన్మథరావు

పార్వతీపురంటౌన్: జిల్లా ఉపఖజానా పరిధిలోని ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగుల క్రమశిక్షణ వివరాలను సత్వరమే వెబ్‌సైట్‌లో పొందుపరచాలని ఖజానాశాఖ ఉప సంచాలకుడు డి.మన్మథరావు శాఖాధికారులను కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక ఎన్‌జీఓ హోంలో జిల్లాలోని వివిధ శాఖాధికారులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయాశాఖల్లో ఉద్యోగులకు సంబంధించిన క్రమ శిక్షణచర్యల వివరాలు పొరపాట్లు లేకుండా కచ్చితంగా నమోదు చేయాలన్నారు. ఎవరైనా ఉద్యోగి సస్పెండ్ అయి నియామకం, కేసుల పెండింగ్, సంబంధిత వివరాలను పొందుపరచాలని, ఉద్యోగి మరణించిన వివరాలు నమోదు చేయాల్సిన అవసరం లేదన్నారు. పదవీవిరమణ అయినప్పటికీ కేసు పరిష్కారం కాకపోతే ఆ వివరాలను నమోదు చేయాలన్నారు. ఈ కేవైసీ నమోదు పెండింగ్ లేకుండా చూడాలని స్పష్టం చేశారు.

వేసవి శిక్షణ తరగతులు సద్వినియోగం చేసుకోవాలి


మాట్లాడుతున్న ఎంపీపీ ప్రమీల

పాచిపెంట: వేసవి నేపథ్యంలో విద్యార్థులకు స్థానిక గ్రంథాలయంలో నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ బద్నాన ప్రమీల కోరారు. ఈ మేరకు మండల కేంద్రంలోని గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులను ఆమె సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యాభివద్ధికి పెద్దపీట వేస్తూ విద్యా వ్యవస్థలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చిందన్నారు. అందులో భాగంగానే ఈ శిక్షణ తరగతులను ప్రారంభించినట్లు చెప్పారు. విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకుని బాగా చదువుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆధ్యాత్మికవేత్త కృష్ణాజీ మాస్టారు, గ్రంథాలయం మాస్టర్ ఉదయభాస్కర్, విద్యార్థులు, యువకులు పాల్గొన్నారు.

గర్వంగా పది ఫలితాలు

పార్వతీపురంటౌన్: పదోతరగతి ఫలితాల్లో అత్యంత వెనుకబడిన జిల్లాగా ఉన్న పార్వతీపురం మన్యం జిల్లా రాష్ట్రంలో పదోతరగతి ఫలితాల్లో మొదటి స్థానంలో నిలవడం ఎంతో గర్వంగా ఉందని జన విజ్ఞాన వేదిక జిల్లా కమిటీ అభినందనలు తెలిపింది. గిరిజన పంచాయతీలు ఎక్కువగా ఉన్నప్పటికీ చదువులో తమకు ఎదురు లేదని రుజువు చేశారని సంతోషం వెలిబుచ్చారు. జిల్లాలో ఉన్న పేదరికాన్ని పాలదోలేలా అధికారులు చర్యలు చేపడితే దానిని ఉపయోగించుకునే తెలివితేటలు సమృద్ధిగా ఉన్నాయని కమిటీ సభ్యులు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ కమిటీలో డాక్టర్ ఎంవీఆర్ కృష్ణాజీ, ఎం రత్నకుమార్, డి.చంద్రమౌళి, ఫరూక్, డి.చంద్రమౌళి తదితరులు ఉన్నారు.

ఘనంగా ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవం


విద్యార్థులకు పంపిణీ చేసిన హైజెనిక్ కిట్లతో రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు

పార్వతీపురం: ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవాన్ని పార్వతీపురం పరిధిలోని కొత్తవలస శివారులో గల ఆశాజ్యోతి ఆశ్రమంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ మంచిపల్లి శ్రీరాములు, కార్యదర్శి బి.నాగభూషణరావు, కోశాధికారి పి.సూర్యారావులు నిరుపేద విద్యార్థులకు హైజెనిక్ కిట్స్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాధితులకు నిస్వార్థంగా సహాయం చేయడంలో ఎంతో ఆనందం ఉంటుందన్నారు. ఇతరుల జీవితాలను మెరుగుపరచడానికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్


టైలరింగ్ శిక్షణ పూర్తి చేసిన మహిళలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే జోగులు, ఎమ్మెల్సీ విక్రాంత్

వంగర: మహిళా సాధికారితే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. మండల పరిధిలోని ఎం.సీ తారాంపురం గ్రామంలో హైదరాబాద్‌కు చెందిన భారత్ డైనమిక్స్ లిమిటెడ్, డీఆర్‌డీఏ సంయుక్తంగా నిర్వహిస్తున్న మహిళల టైలరింగ్ శిక్షణ కేంద్రంలో మూడు నెలలు టైలరింగ్ నేర్చుకున్న మహిళలకు సర్టిఫికెట్లు, కొత్త బ్యాచ్‌కి వెల్‌కమ్ కిట్లు సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టైలరింగ్‌తో మహిళలు స్వయం ఉపాధి పొంది, తద్వారా కుటుంబానికి బాసటగా నిలుస్తారన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు యూనిట్లు నెలకొల్పేందుకు వెలుగు ఏరియా కో–ఆర్డినేటర్ ఆధ్వర్యంలో రుణాలు మంజూరు చేస్తారన్నారు. పీఎంఈజీసీ ప్రోగ్రాం ద్వారా బీసీలకు 35 శాతం, ఎస్సీ, ఎస్టీలకు 45 శాతం సబ్సిడీతో యూనిట్లు ఏర్పాటు చేసి, అవసరమైన రుణం ప్రభుత్వం మంజూరు చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ, మండల పార్టీ కన్వీనర్ కరణం సుదర్శనరావు, వైస్ ఎంపీపీ కిమిడి ఉమామహేశ్వరరావు, సర్పంచ్ కాంబోతుల కళావతి, కర్రి సుగుణమ్మ, వెలుగు ఏరియా కో–ఆర్డినేటర్ అలుగోలు చిరంజీవి, ఎంఎంఎస్ అధ్యక్షురా లు కాంబోతుల భగవతి తదితరులు పాల్గొన్నారు.

వేసవి విజ్ఞాన కేంద్రాలు వినియోగించుకోవాలి


బొబ్బిలి: వేసవి విజ్ఞాన తరగతిలో పాల్గొన్న చిన్నారులు


బాడంగి : గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అధికారులు

విద్యార్థులు వేసవి సెలవులను సద్వినియోగం చేసుకునేందుకు ప్రభుత్వం వేసవి విజ్ఞాన కేంద్రాలు (చదవడం మాకిష్టం) ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా గ్రామాల్లోని గ్రంథాలయాల్లో సోమవారం నుంచి 35 రోజుల పాటు ప్రత్యేక తరగతులు నిర్వహించనున్నారు. విద్యార్థులు టీవీలు, సెల్‌ఫోన్లతో సమయం వృథా చేయకుండా చదువుపై మనసు లగ్నం చేసేందుకు ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడనుంది. పాటలు, కథలు, చిత్రలేఖనం, స్పోకెన్ ఇంగ్లిష్, కంప్యూటర్ బేసిక్స్, తదితర అంశాల్లో తర్ఫీదు ఇవ్వనున్నారు. కార్యక్రమం ప్రారంభం సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు

– బాడంగి/బొబ్బిలి/రామభద్రపురం/ తెర్లాం

క్లుప్తంగా

గ్రామదేవత ఉత్సవాలు ప్రారంభం


బర్లి గ్రామంలో తిరుగుతున్న ఘటాలు

బలిజిపేట: మండలంలోని బర్లి, మిర్తివలస, తుమరాడ గ్రామాల్లో గ్రామదేవత ఉత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఉత్సవాల సందర్భంగా కొద్ది రోజుల నుంచి గ్రామంలో ఘటాలు తిరుగుతున్నాయి. ముఖ్యంగా సోమవారం పండగ, మంగళవారం సిరిమాను ఉత్సవం, బుధవారం అనుపు ఉత్సవాన్ని గ్రామాల్లో ఘనంగా నిర్వహించనున్నారు. బర్లి, మిర్తివలసల్లో శ్రీశ్రీశ్రీ గజాలమ్మ తల్లి, బంగారమ్మ తల్లి ఉత్సవాన్ని, తుమరాడలో శ్రీశ్రీశ్రీ పాదాలమ్మ తల్లి, బురదాలమ్మ తల్లి, పురటాలమ్మ తల్లి ఉత్సవాన్ని నిర్వహించనున్నారు. మంగళవారం నిర్వహించనున్న సిరిమాను ఉత్సవానికి ఘనంగా ఏర్పాట్లు చేశారు.

మండల టాపర్‌కు అభినందనలు


వంతరాం ఉన్నత పాఠశాలలో విద్యార్థినిని అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు

బలిజిపేట: పదో తరగతి పరీక్షా ఫలితాల్లో మండలంలో అత్యధికంగా మార్కులు సాధించిన విద్యార్థినిని వంతరాం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు సోమవారం అభినందించారు. వంతరాం ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని డి.ఉమామహేశ్వరికి పదో తరగతి పరీక్షల్లో 582మార్కులు వచ్చాయి. మండలంలో అత్యధికంగా మార్కులు సాధించిన ఈ విద్యార్థినిని ప్రధానోపాధ్యాయుడు ఎం.వెంకట్రావు, సహా ఉపాధ్యాయులు, గ్రామస్తులు సత్కరించారు. భవిష్యత్‌లో మంచి విద్యను అభ్యసించి మంచి పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలని అంతా ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పెద్దలు పాల్గొన్నారు.

పుస్తకాల పరిశీలన


మండలానికి వచ్చిన పుస్తకాలను పరిశీలిస్తున్న ఎంఈఓ శ్రీనివాసరావు

బలిజిపేట: మండలానికి మొదటి విడతగా వచ్చిన పాఠ్యపుస్తకాలను ఎంఈఓ శ్రీనివాసరావు సోమవారం పరిశీలించారు. బలిజిపేట ఉన్నత పాఠశాలలో పాఠ్యపుస్తకాలు, జగనన్న విద్యా దీవెన కిట్లు భద్రపరుస్తామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. వచ్చిన బ్యాగులు, పుస్తకాలు, బూట్లు, అన్ని రకాల వస్తువులను ఉంచేందుకు ప్రత్యేక గదులను తీసుకున్నట్లు చెప్పారు. 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు మొదటి విడతలో 13,563పాఠ్యపుస్తకాలు వచ్చాయన్నారు. మొత్తం 40వేల పుస్తకాలు రావాల్సి ఉందని వచ్చిన పుస్తకాలను రోల్ ప్రకారం పంపిణీ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సీఆర్‌పీలు పాల్గొన్నారు.

గ్రంథాలయానికి రూ.5వేలు వితరణ


వితరణ అందిస్తున్న దాత రాము

బలిజిపేట: మండలంలోని పెదపెంకి నేతాజీ గ్రంథాలయానికి శాశ్వత వితరణగా వి.రాము రూ.5వేలను గ్రంథాలయ వ్యవస్థాపకుడు ఈర్ల సంజీవనాయుడుకు సోమవారం అందించారు. గ్రంథాలయం అభివృద్ధికి ఈ మొత్తాన్ని వినియోగించాలని కోరారు. కార్యక్రమంలో ఎన్.రాజేష్, ఆర్.శంకర్, ఎన్.రామకృష్ణ, సంజయ్‌దత్, రామిశెట్టి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆలయ ప్రారంభోత్సవం

సంతకవిటి: మండలంలోని మందరాడ గ్రామంలో కొత్తగా నిర్మించిన గణపతి, సుబ్రహ్మణ్య, అయ్యప్ప, శ్రీసత్యనారాయణస్వామి, నవగ్రహాల, దత్తాత్రేయ, నాగబంధ, షిర్డీసాయి, సత్యసాయి ఆలయాల ప్రతిష్ఠా మహోత్సవాలు మంగళవారం నుంచి నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు సోమవారం తెలిపారు. మే 11వ తేదీ వరకు జరిగే ఈ కార్యక్రమాల్లో తొలిరోజు ఆధ్యాత్మిక ప్రవచన కార్యక్రమాలు, రెండో రోజు కూచిపూడి, భరత నాట్య ప్రదర్శనలు, మూడో రోజు విగ్రహాలకు ప్రాణప్రతిష్ఠ చేయడంతో పాటు అన్నదాన కార్యక్రమం, సాయంత్రం రేలారే రేలా ప్రదర్శన ఉంటుందన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యం

- డీఎస్పీ పుల్లారు శ్రీధర్

బొబ్బిలి: శాంతి,భద్రతల పరిరక్షణే ధ్యేయంగా పనిచేస్తానని డీఎస్పీ పల్లారు శ్రీధర్ అన్నారు. సబ్ డివిజన్ నూతన డీఎస్పీగా నియమితులైన ఆయన సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన ఎస్పీ, డీఐజీలను మర్యాదపూర్వకంగా కలిశారు.